అక్రమ పార్కింగుపై చర్యలు తీసుకోండి

- ప్రధాన రహదారిపై భారీ వాహనాల పార్కింగ్
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న ప్రజలు



మధుబన్ ప్రధాన రహదారిపై అక్రమ పార్కింగ్ చేసిన లారీలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారిపై భారీ వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రోజుల తరబడి ఇరువైపుల భారీ వాహనాలు రోడ్లపై ఉండటంతో ఇతర వాహనదారులు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ నుంచి రామ్‌చరణ్ ఆయిల్‌మిల్, రవిఫుడ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై నెలల తరబడి పార్కింగ్ చేస్తున్న లారీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలోనే ప్రమాదం..

గతంలో రెండు లారీలు మధ్య నుంచి బస్సు వెళ్లలేక ప్రమాదం చోటు చేసుకోగా.. కిటికీ పక్కన కూర్చున్న ఇద్దరు ప్రయాణీకులు గాయపడ్డారు.

- ప్రమాదాలు జరిగినప్పుడే రోడ్డుపై రెండు మూడు రోజులు పార్కింగు చేయకుండా చూస్తారని స్థానికులు మండిపడుతున్నారు.
- కొన్ని రోజులు కాగానే తిరిగి మాములే యాధావిధిగా రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు.
- ట్రాఫిక్ పోలీసులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక కంపెనీ యాజమాన్యాలతో మాట్లాడి మాముళ్లతో సరిపెట్టుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- పరిశ్రమలకు వచ్చే వాహనాలు రోడ్డుపై నిలువకుండా తమ పరిశ్రమలో ప్రత్యేక పార్కింగ్ చేసుకునే విధంగా చూడాలని స్థానిక ప్రజలు సంబంధిత కంపెనీల యాజమాన్యాలను కోరుతున్నారు.

అక్రమ పార్కింగ్‌తో సతమతమవుతున్నాం




రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు రవి ఫుడ్ ప్రధాన రహదారిపై ఇరువైపుల భారీ వాహనాలు నిలపడంతో ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌జామ్ అవుతుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు అక్రమ పార్కింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సంపంగి నర్సింహ, వాహనదారుడు

తుది జాబితాలో భారీగా పెరిగిన ఓటర్లు

- రాజేంద్రనగర్ సర్కిల్‌లో 13,831 మంది ఓటర్లు
- నియోజకవర్గంలో 5,77,937 మందికి చేరిన సంఖ్య



రాజేంద్రనగర్ నియోజకవర్గం మ్యాప్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. పేర్ల నమోదుకు చివరి అవకాశం ఇవ్వడంతో నియోజకవర్గ ఓటర్లు భారీగా స్పందించారు.

- కొత్తగా 25,575 మంది ఓటర్లుగా తమ పేర్లను ఓటరు లిస్టులో నమోదు చేయించుకున్నారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల సంఖ్య 5,77,937 మందికి చేరింది. చివరి అవకాశంలో ఓటులేని వారు పెద్ద సంఖ్యలో స్పందించడంతో ఓటర్ల సంఖ్య పెరిగింది.
- గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు భారీగా పెరిగారు. వీరే నేడు అభ్యర్థుల జయాపజయాలపై ప్రభావం చూపనున్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో అత్యధికం...

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లలో గతంలో 2,99,616 మంది ఓటర్లుగా నమోదయ్యారు. తుది జాబితాలో 13,831 మంది కొత్తగా చేరారు. దీంతో సర్కిల్ పరిధిలో ఓటర్ల సంఖ్య 3,13,447 మందికి చేరింది. సర్కిల్‌లోని 5 డివిజన్లలో దాదాపు 14 వేల కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేయించుకున్నారు. ఎన్నికల్లో వీరి ఓటు కీలకంగా మారనుంది.

మండలాల్లో పెరిగిన ఓటర్లు...

- నియోజకవర్గ పరిధిలోని గండిపేట్ మండలంలో 8,630 మంది తుది జాబితాలో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు.
- మండల పరిధిలో మొత్తం 1,77,631 ఓటర్లుగా తుది జాబితాలో నమోదయ్యారు. శంషాబాద్ మండలంలో అత్యల్పంగా 3,114 మంది తుది జాబితాలో ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించారు. శంషాబాద్ మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 86,889కు చేరింది.

ఇతర ఓటర్ల సంఖ్య 44..

- నియోజకవర్గ పరిధిలో ఇతర ఓటర్లు 44 మందిగా నమోదయ్యారు. గతంలో 39 మంది ఉండగా తుది జాబితాలో ఇద్దరు పెరిగి, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 44 గా ఉంది.

అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ దర్గా ఖలీజ్‌ఖాన్ కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లా, అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ రాజునాయక్‌ల ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు చెందిన 100 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా అభివృద్ధి జరిగిందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కో– ఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, సీనియర్ నాయకులు నవాబ్ ముంతాజ్, బషీర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ రాజునాయక్, యూత్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, రవీందర్, చేగూరి రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, జయరాజ్, శశికుమార్, అక్షయ్‌కుమార్, జగదీష్ తదితరులున్నారు.

కార్పొరేటర్ ఎన్నికలు ప్రచారం

రాజేంద్రనగర్: హైదర్‌గూడలోని ఎర్రబోడలో స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు మద్దతుగా కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తూ.. ఓటు అభ్యర్థించారు. డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేశ్, యాదమ్మ, సుజాత, సుమలత, ఎం.ప్రభాకర్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి దేవదాస్, రాజుగౌడ్, రజనీకాంత్‌గౌడ్ తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అత్తాపూర్: భోజనం చేస్తూనే ఓ పెయింటర్ మృతి చెందిన ఘటన శివరాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నిమ్మల వెంకన్న, ఏఎస్సై ఆర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... రాములు బతుకుదెరువు నిమిత్తం శివరాంపల్లి కిషన్‌నగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. రాములు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు. కాగా భార్య రాజేంద్రనగర్‌లో ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తోంది. ఆమె విధులు ముగించుకుని ఇంటికొచ్చేసరికి భర్త అనుమానాస్పదస్థితిలో పడి ఉన్నాడు. దీంతో విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు వచ్చి చూడగా.. అప్పటికే రాములు మృతి చెందినట్లు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కార్వాన్‌లో విజయం నాదే: అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్‌లో ఈసారి విజయం తనదేనని కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద గల బీజేపీ కార్యాలయంలో జరిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లల్లో కార్వాన్ నియోజకవర్గం పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుందని ఆయన ఆరోపించారు. తాను నేడు నామినేషన్ తాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్, నాయకులు సచిన్‌కామ్లెకర్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం'



గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం ప్రచండంగా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్ అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థుల భారీ విజయం కోసం ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. తెలంగాణలో పదేళ్లుగా నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని నిరాశలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. ఎం.ఆర్.రెడ్డి, అమిత్‌ఖాన్, చంద్రశేఖర్, చంటిబాబు, కిషన్, వినోద్‌సింగ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

పాత వీడియోలు వైరల్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

రాజేంద్రనగర్: పాత వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ రాజేంద్రనగర్ పోలీసులకు లిఖితపూర్వకంగా బుధవారం ఫిర్యాదు చేశాడు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీలో చీలికలు ఏర్పడి ఒకరిపై ఒకరూ పరస్పరం బహిరంగంగా ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇది కాస్తా ముదిరి పోలీస్‌స్టేషన్‌కు వరకు చేరింది. కార్పొరేటర్ సాగర్‌గౌడ్ గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగాడు. అప్పటి ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై ఆయా సందర్భాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడిన వీడియో క్లిప్పులను సేకరించిన ఓ కార్పొరేటర్ భర్త వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ పోస్టు కాస్తా వైరల్‌గా మారింది. గతంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై ఘాటుగా స్పందించిన మాటలు ఉండటంతో దానిపై వెంటనే స్పందించారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రమేశ్‌కు సాగర్‌గౌడ్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బతికి ఉన్నంత వరకు ప్రజల మధ్యే ఉంటా'



ఎమ్మెల్యేకు తులాభారం చేస్తున్న దృశ్యం

గోల్కొండ: సామాన్య కార్యకర్తగా మజ్లిస్ పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించానని ప్రజల అండదండలతో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని ఇదంతా ప్రజల ఆశీర్వాదం వల్లే అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయనను నానల్‌నగర్ ఖాదర్‌బాగ్‌లో మజ్లిస్ ఆధ్వర్యంలో మిశ్రీ(కడి చక్కర)తో తులాభారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అభిమానం తాను జీవితంలో ఏనాడు మరువనని బతికి ఉన్నంత కాలం ప్రజలతోనే ఉంటానని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం ఇవ్వబడిందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాభిమానంతో ఈసారి ఎన్నికల్లో కూడా తాను భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ మజ్లిస్ నాయకులు షబ్బీర్‌ఖాన్, బద్దర్‌ఉద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

కాంగ్రెస్ వల్లే రాజేంద్రనగర్ అభివృద్ధి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



శంషాబాద్: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే రాజేంద్రనగర్ నియోజకవర్గానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని శంషాబాద్ తొండుపల్లి క్రికెట్ మైదానంలో బుధవారం రాత్రి చేపట్టిన కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరైన ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగురోడ్డు కారణంగానే రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. నియోజకవర్గంలోని కోకాపేట, బుద్వేల్ భూములను వేలకోట్లకు వేలంపాట వేసి అమ్ముకుంటున్న ప్రభుత్వానికి ఇక్కడున్న ప్రజలకు మాత్రం కనీసం డబుల్‌బెడ్రూం ఇచ్చే మనసు కూడా లేదన్నారు.

కాంగ్రెస్ విజయభేరి విజయవంతం ..

శంషాబాద్: కాంగ్రెస్ విజయభేరి విజయవంతమైంది. పట్టణంలోని తొండుపల్లి క్రికెట్ మైదానంలో జరిగిన విజయభేరిలో సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు శంషాబాద్ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జన సమీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. అవినీతి, భూ కబ్జాలను అరికట్టాలంటే చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బుధవారం కోరని శ్యామ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలంతా బుద్వేల్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి కార్యకర్తలు, నాయకులు పాదచారులు, వాహనదారులకు పంచి పెట్టారు. వృద్ధులు, వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ.. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు నరేందర్‌తో పాటు మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

12 నామినేషన్లు దాఖలు

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు బుధవారం 12 మంది దరఖాస్తులు వచ్చాయని రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న కస్తూరి నరేందర్‌ముదిరాజ్ దరఖాస్తులను కస్తూరి యాదయ్య ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారికి అందజేశారు. కె.శ్రీనివాస్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు నామినేషన్లు వేశారు. ధర్మ సమాజ్ పార్టీ నుంచి రాఘవేందర్, ఐపీబీపీ నుంచి పాల్మకుల మధు దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్పీ నుంచి దండో టిక్కర్ నామినేషన్ వేయగా... స్వతంత్ర అభ్యర్థిగా యుగ తులసి అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి ఆశ్వినిరెడ్డి దరఖాస్తు చేశారు. బీఎస్పీ నుంచి రాచమల్ల జయసింహ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

23 పుస్తకాల ఆవిష్కరణ

రాయదుర్గం: మనూలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు రచించిన 23 పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. ఇంగ్లిష్, అరబిక్, ఉర్దూ భాషల్లో వివిధ విషయాలను పొందుపరుస్తూ ఈ పుస్తకాలను రూపొందించారు. కార్యక్రమంలో ఐక్యూసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ప్రొఫెసర్ రామ కొండపల్లి పాల్గొన్నారు.


'మనూ'లో వర్క్‌షాప్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌కే షేర్వానీ సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్, సొసైటీ ఫర్ ఇండియన్ ఓషన్ స్టడీస్ (ఎస్ఐఓఎస్) న్యూఢిల్లీ సహకారంతో ' ది డెక్కన్: మారిటైమ్ ఔట్‌లుక్ అండ్ ఆపర్చునిటీస్' అనే అంశంపై మనూలో ఒక రోజు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రక్షణ వ్యూహం, వాణిజ్య మార్గాలు, కమ్యూనికేషన్లు, షిపింగ్, షిప్పింగ్ సాంకేతికత, సముద్ర కనెక్షన్‌లు, భారతదేశంలోని ఓడరేవులు, షిప్పింగ్, షిప్ బిల్డింగ్ యొక్క ప్రస్తుత స్థితి వంటి అనేక అంశాలు చర్చకు వచ్చాయి. సమావేశంలో ఎస్ఐఓఎస్ చైర్మన్ రాయబారి సుధీర్ దేవరే, అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్, ఉస్మానియా యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీరావు ప్రసంగించారు.

హెచ్‌సీయూ- ముంబాయి టీమ్ లీజ్ ఎడ్‌టెక్ ఒప్పందం

రాయదుర్గం: వృత్తిపరమైన డిప్లొమో కోర్సులను అందించడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- ముంబైలోని టీమ్ లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రాంగణంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై బుధవారం సంతకాలు చేశారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, టీమ్ లీజ్ తరపున ఆ సంస్థ బిజినెస్ రీజినల్ హెడ్ రోహిత్‌డోగ్రా సంతకాలు చేశారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ప్రొఫెసర్ ఎస్ఎల్ సబత్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. రెండు సంస్థలు కలిసి సీడీబీఎల్ ద్వారా ఆన్‌లైన్‌లో పలు కోర్సులను అందించేందుకు అంగీకరించారు. ముఖ్యంగా డిప్లొమో ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ (డీఈఎస్ఎం), డిప్లొమో ఇన్ కమ్యూనికేషన్ సి ఇంగ్లిష్ (డీసీఈ), డిప్లొమో ఇన్ గవర్నెన్స్ (డీజీ), డిప్లొమో ఇన్ ఏఐ అండ్ ఎంఎల్ (డీఏఐ అండ్ ఎంఎల్), జావా ఎఫ్ఎస్‌డీలో డిప్లొమో వంటి కోర్సులను అందించాలని ఒప్పందంలో నిర్ణయించారు. ఈ ఒప్పందం మూడేళ్ల కాలపరిమితితో అమలులో ఉంటుంది. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆర్ అండ్ డీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ఎల్ సబత్, సీడీవీఎల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ జిలాని, ప్రొఫెసర్ ఈ వెంకటేష్, టీమ్ లీజ్ యూనివర్శిటీ బిజినెస్ డెవలప్‌మెంట్ సీనియర్ మేనేజర్ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి



శేరిలింగంపల్లి: తెలంగాణ అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో బీజేపీ నాయకులు గోదావరి అంజిరెడ్డి, మహిపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రతి ఓటరును కలిసి మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు.

బీసీ ముఖ్యమంత్రి ప్రకటన హర్షణీయం



మాట్లాడుతున్న కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్

శంషాబాద్ : రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీకి ఆ పార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు 11వ వార్డు కౌన్సిలర్ కె. ప్రవీణ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి బీజేపీ పార్టీ కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడంతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శ్రీనివాస్, కుమార్, రమేష్, బాల్‌రాజ్, అరుణ్ తదితరులున్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ



బండ్లగూడ: తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే హక్కును కల్పించిన ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలో బుధవారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. షాదాన్ కళాశాల నుంచి పీరంచెరువు కమాన్, డాన్‌బాస్కో పాఠశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కమిషనర్ బి.శరత్‌చంద్ర మాట్లాడుతూ.. ఓటు అనే ఆయుధాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అభివృద్ధి చేసే నాయకులను ఎంచుకునేందుకు రాజ్యాంగం ఓటును కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యాలయ సిబ్బంది మెప్మా సిబ్బంది తదితరులున్నారు.

ముమ్మరంగా ప్రచారాలు

మణికొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధాన మూడు పార్టీల ఎమ్మెల్యే టికెట్లు ఖరారు కావడంతో క్యాడర్ ప్రచారానికి దిగింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బీఆర్ఎస్, కాంగ్రెస్ తరపున మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, బీజేపీ తరపున మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ బరిలో నిలవటం వారి తరపున ఆయా పార్టీలకు చెందిన నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. తమ పార్టీలు ప్రజలకు ప్రకటించిన పథకాలు, విధానాలను ఇంటింటికి వెళ్లి ఓటర్లకు వివరిస్తున్నారు. ఆయా పార్టీల అధ్యక్షులు, ముఖ్యనాయకుల నేతృత్వంలో బృందాలుగా ఏర్పడి అపార్టుమెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, గృహాల వారీగా తిరుగుతూ.. పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ.. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తు ప్రచారం నిర్వహిస్తున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల ప్రచార జోరు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో భాగంగా బుధవారం బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్, బృందావన్ కాలనీలలో డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ.. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాముగౌడ్, సంకురి జయప్రకాష్, సోమశ్రీనివాస్, వెంకటేష్, రాఘవేందర్ తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థికి సన్మానం



తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అత్తాపూర్: మచ్చలేని నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి విజయం నల్లేరు మీద నడకేనని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు నారగూడెం మల్లారెడ్డి, జోగిరవి, మల్లేష్‌యాదవ్‌లు అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, దొరల పాలన నుంచి విముక్తి చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కేటీఆర్‌ని ముఖ్యమంత్రి పదవీ అంటగట్టేందుకు పెద్దఎత్తున కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా నూతనంగా యువ ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, వారంతా బీజేపీ పార్టీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రాచూరి రాజశేఖర్, కాడెం సుధాకర్, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధి, సంక్షేమమంటే బీఆర్ఎస్‌యే !

అత్తాపూర్: అభివృద్ధి సంక్షేమమంటే బీఆర్ఎస్ పార్టీ అని తెలంగాణ రాష్ట్ర ప్రజల గుండెల్లో రాజముద్రగా నిలిచిందని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేందర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిలు అన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ విజయాన్ని ఆకాంక్షిస్తూ.. ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆసరా పెన్షన్ల పెంపు, కేసీఆర్ బీమా, అన్నపూర్ణ పతకం, సౌభాగ్యలక్ష్మి పథకం, కేసీఆర్ ఆరోగ్యరక్ష తదితర పథకాలు చేపడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మధు, సత్తిరెడ్డి, పీఎం రెడ్డి, ముఖేశ్, అప్పారెడ్డి, శేఖర్, అర్జున్ రెడ్డి, మహేష్, శివారెడ్డి, నరేందర్, కృష్ణ, రవి తదితరులున్నారు.

'దేశంలో ప్రధాని మోదీ హవా'



గోల్కొండ: దేశంలో ప్రధాని మోదీ హవా కొనసాగుతుందని బ్లాక్‌వర్డు క్లాసెస్ కమిటీ జాతీయ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ ఆహీర్ అన్నారు. బుధవారం పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో కూడా భారీ మెజారీతో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. తెలంగాణలో ప్రాంతీయ పార్టీల శకం ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో సచిన్ కామ్లెకర్, బిజ్వర్‌సింగ్ తదితరులున్నారు.